ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 2
మార్చి 2025



# బ్రహ్మోత్సవ సంరంభానికి శ్రీకారం...!!

## యాదగిరిగుట్టలో బ్రహ్మోత్సవ శోభ'

**ఉత్సవాల్లో తొలి ఘట్టం స్వస్తివాచనం నిర్వహించిన అర్చకులు**

**రాత్రి వేళ పుణ్యాహవచనం, రక్షాబంధనం...**

**ఈ నెల 11 వరకు 11 రోజుల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాలు**

**నేడు ధ్వజారోహణం, భేరిపూజ, దేవతాహ్వానం**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం జరిగిన స్వస్తి వాచనంతో ఉత్సవాలకు అర్చకులు శ్రీకారం పలికారు. ఉదయం స్వస్తివాచనం, పుణ్యాహవచనం, రక్షాబంధనం, విశ్వక్సేన పూజలతో ఆలయ అర్చకులు బ్రహ్మోత్సవాల్లో తొలి పూజలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. సాయంత్రం అంకురారోపణం, మృత్సంగ్రహణ కైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదట.. ఆలయ ప్రధానార్చకులు నల్లంతీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల అర్చకత్వంలో అర్చకులు ప్రధానాలయంలోని స్వయంభూ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భాలయంలో ఉన్న స్వయంభూ మూర్తి అనుమతి తీసుకుని అర్చకులు బ్రహ్మోత్సవ కైంకర్యాలని షురూ చేశారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ప్రత్యేక పూజలతో ఉత్సవాల సందడి మొదలైంది. శనివారం మొదలైన బ్రహ్మోత్సవాల సందడి ఈ నెల 11 వరకు.. 11 రోజుల పాటు నిర్విరామంగా కొనసాగనున్నాయి. ఉదయం స్వస్తివాచనంతో మొదలైన బ్రహ్మోత్సవాలు 11న నిర్వహించే అష్టోత్తర శతఘటాభిషేకం, శృంగార డోలోత్సవంతో ముగియనున్నాయి. ఇక ఉత్సవాల్లో ముఖ్య ఘట్టాలు 7న స్వామివారి ఎదుర్కోలు, 8న తిరుకల్యాణం, 9న దివ్యవిమాన రథోత్సవం ఉత్సవాలను నయనానందకరంగా జరగనున్నాయి.


తొలిరోజు బ్రహ్మోత్సవ పూజల్లో పాల్గొంటున్న ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, ఈవో భాస్కర్ రావు


ప్రధానాలయంలో మంత్రపూరిత జలంతో సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు



## స్వస్తివాచనంతో మొదలైన బ్రహ్మోత్సవాల సందడి

యాదగిరిగుట్ట నరసింహస్వామి ప్రధానాలయంలో బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ఆరంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు నవాహ్నిక దీక్షతో పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ అర్చకులు విష్వక్సేనపూజ, స్వస్తివాచనం, పుణ్యాహవచనం, రక్షాబంధనంతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. విశ్వశాంతి, లోకకల్యాణం కోసం వేదమంత్రాలు పఠిస్తూ విష్వక్సేన ఆరాధన చేశారు. బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా పరిసమాప్తి కావడం కోసం విష్వక్సేనపూజ నిర్వహించారు. ముందుగా పుణ్యాహవచనంలో భాగంగా పవిత్ర జలంతో ఆలయ పరిసరాలను సంప్రోక్షణ చేసి లక్ష్మీసమేత నారసింహుడికి రక్షాబంధనం గావించారు. గర్భగుడిలో ఉన్న స్వయంభూ లక్ష్మీనరసింహస్వామికి కంకణధారణ చేసిన అనంతరం.. ముఖ మంటపంలో అధిష్టింపజేసిన ఉత్సవమూర్తులకు రక్షాబంధనం చేశారు. మొదటగా బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా తెప్పించిన పూలతో చూడముచ్చటగా ముస్తాబు చేశారు. వజ్రవైఢూర్యాలు, ముత్యాల హారాలు, బంగారు ఆభరణాలతో స్వామివారు ధగధగ మెరిసిపోయేలా అలంకరిచారు. తర్వాత ఆలయ ముఖ మండపంలో లక్ష్మీనరసింహులను బంగారు వేదికపై అధిష్టింపజేసి స్వస్తివాచనం, పుణ్యాహవచనం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక సాయంత్రం ప్రధానాలయంలో నిత్య ఆరాధనల అనంతరం.. మృత్సంగ్రహణం, అంకురారోపణం ఉత్సవాలు కన్నులపండువగా జరిపారు. వేదపండితుల మూలమంత్ర, మూర్తిమంత్ర జపాల మధ్య అర్చకులు అంకురారోపణ ఉత్సవాన్ని పాంచరాత్ర ఆగమశాస్త్ర పద్ధతిలో ఘనంగా నిర్వహించారు. తొలిరోజు బ్రహ్మోత్సవ కైంకర్యాల్లో టెంపుల్ చైర్మన్ నర్సింహమూర్తి, ఈవో భాస్కర్ రావు, డిప్యూటీ ఈవో భాస్కర్ శర్మ, ఏఈవోలు గజవెల్లి రఘు, నవీన్, ఉప ప్రధానార్చకులు మాధవాచార్యులు, నరసింహమూర్తి, లక్ష్మణాచార్యులు, పర్యవేక్షకులు రామారావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## అలరించిన గరికపాటి నృసింహ వైభవం

యాదగిరిగుట్ట నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొండపైన చేపట్టిన సాంస్కృతిక, సంగీత, ధార్మిక, సాహిత్య మహాసభలు భక్తులను విశేషంగా అలరించాయి. ఇందులో భాగంగా సహస్రావధాని, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు చేసిన నృసింహ వైభవం ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ చరిత్రలో మొదటిసారిగా గరికపాటితో ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహింపబడుతుండడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు గరికపాటి ప్రవచనాలు సాగాయి. గరికపాటితో మార్చి ఒకటిన మొదలైన నృసింహ వైభవం ఆధ్యాత్మిక ప్రవచనాలు ఈ నెల 3 వరకు కొనసాగనున్నాయి. మరోవైపు బ్రహ్మోత్సవాల సందర్భంగా కొండపైన నీలిమా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు మెడికల్ క్యాంప్ కొనసాగనుంది. ఉచిత వైద్య శిబిరం ద్వారా డాక్టర్లు అవసరమైన భక్తులకు పరీక్షలు చేసి ఫ్రీగా మందులు పంపిణీ చేస్తున్నారు.

## నేడు ధ్వజారోహణం, భేరిపూజ, దేవతాహ్వానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం ఆలయ అర్చకులు ధ్వజారోహణం, భేరిపూజ, దేవతాహ్వానం కైంకర్యాలను నిర్వహించనున్నారు. ఉదయం ధ్వజారోహణంతో గరుత్మంతుడి ద్వారా లక్ష్మీనరసింహుల కల్యాణానికి ముక్కోటి దేవతలకు ఆహ్వానం పంపనున్నారు. ఆహ్వానాన్ని అందుకుని నరసింహుడి కల్యాణాన్ని వీక్షించి ఆశీస్సులు అందించడం కోసం భువికి దిగివచ్చిన సకల దేవతలకు సాయంత్రం భేరిపూజ ద్వారా స్వాగతం పలికే తంతును నిర్వహించనున్నారు











